సాక్షి
కుమురం భీం

సోమవారం । 11 । ఆగస్టు । 2025



'నులి'పేద్దాం..! 8లో▸

ఈ నెల 11న జాతీయ నులి పురుగుల నివారణ దినంగా జరపనున్నారు. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు.



నిలిచిన పనులు 9లో▸

వాంకిడి మండలం ఎనోలి గ్రామానికి దశాబ్దాలుగా సరైన రోడ్డు సౌకర్యం లేదు. గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు కాగా, పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.1 /25.3

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో చాలాచోట్ల ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రైతుబీమాకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో జూన్ 5 నాటికి పట్టా పాసు పుస్తకాలు పొందిన రైతులు ప్రభుత్వం అందించే రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న రైతులు వివరాలు మార్పు కోసం సంబంధిత ఏఈవోలను సంప్రదించాలని సూచించారు. ఈ నెల 13లోగా పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, నామిని వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

ఆర్టీసీకి రాఖీ ధమాకా



ఆసిఫాబాద్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

ఆసిఫాబాద్: రాఖీ పండుగను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోకు భారీ ఆదాయం సమకూరుతోంది. రాఖీ పౌర్ణమి సందర్భంగా జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు మూడు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. డిపోకు మామూలు రోజుల్లో రోజుకు రూ.16 లక్షల నుంచి రూ. 18లక్షల ఆదాయం వస్తోంది. రక్షాబంధన్ నేపథ్యంలో ఈ నెల 8న 47 వేల మంది ప్రయాణికులను గమ్యానికి చేర్చగా రూ.21,78,000 ఆదాయం సమకూరింది. ఈ నెల 9న 48 వేల మంది ప్రయాణించగా రూ.21,61,000 ఆదాయం వచ్చిందని డీఎం రాజశేఖర్ తెలిపారు. ఆదివారం సైతం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికుల రద్దీ కొనసాగింది.

నేడు ఎన్‌సీఎస్‌సీ సభ్యుడి రాక

ఆసిఫాబాద్: షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్(ఎన్‌సీఎస్‌సీ) సభ్యుడు వడ్డేపెల్లి రామ్‌చందర్ సోమవారం కాగజ్‌నగర్‌కు రానున్నారని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్సీ బస్తీని సందర్శిస్తారని అన్నారు. షెడ్యూల్డ్ కులాలకు చెందిన ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నారని పేర్కొన్నారు.

'ఆదాయం వెల్లడించకపోవడం సరికాదు'



మాట్లాడుతున్న గోపాల్

తిర్యాణి(ఆసిఫాబాద్): చింతలమాదర జలపాతానికి వచ్చే ఆదాయం వెల్లడించకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదని ఏకో టూరిజం కమిటీ(ఈటీసీ) చైర్మన్ తుంరం గోపాల్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పర్యాటకుల కోసం జలపాతం వద్ద ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదన్నారు. టికెట్లు ఇవ్వకుండా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆదాయాన్ని 80 శాతం జలపాతం అభివృద్ధి, 20 శాతం పంచాయతీ అభివృద్ధికి వినియోగించాల్సి ఉన్నా.. పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో కమిటీ సభ్యులు కృష్ణ, నాగు, అర్జున్, సాగర్, సోము తదితరులు పాల్గొన్నారు.


ఎస్టీ హోదా కల్పించే వరకు పోరాటం



నినాదాలు చేస్తున్న నాయకులు

కాగజనగర్‌టౌన్: మాలీ కులస్తులకు ఎస్టీ హోదా కల్పించే వరకు పోరాటం చేస్తామని మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యామ్‌రావు అన్నారు. కాగజ్‌నగర్‌లోని జ్యోతిబా పూలే భవనంలో ఆదివారం మాలీ సంక్షేమ రాష్ట్ర, జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం 2022లో అసెంబ్లీలో మాలీ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని తీర్మానం చేసిందని అన్నారు. కానీ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. మాలీ కులస్తులకు న్యాయం చేయకుంటే ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, హన్మంతు, వాసుదేవ్, శ్రీనివాస్, తిరుపతి, రంగశ్రీనివాస్, నిరంజన్ పాల్గొన్నారు.

ఫేక్ హాజరు వేస్తే సస్పెన్షనే..!



దహెగాం మండలం లగ్గాంలో హాజరు వేసుకుంటున్న పంచాయతీ కార్యదర్శి

- కార్యదర్శులపై చర్యలకు సిద్ధమైన ప్రభుత్వం
- తప్పనిసరిగా పంచాయతీ పరిధిలో అటెండెన్స్ వేయాల్సిందే..

దహెగాం(సిర్పూర్): ఇటీవల రాష్ట్రంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు ఫేక్ హాజరు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. విధులకు రాకున్నా ఫేక్ హాజరు వేసే కార్యదర్శులపై చర్యలకు తీసుకోనుంది. నకిలీ ముఖ గుర్తింపు హాజరు వేసేవారికి షోకాజ్ నోటీసులు జారీ చేయడంతోపాటు అవసరమైతే సస్పెన్షన్ వేటు వేసేందుకు సన్నద్ధమవుతోంది. కాగా జిల్లాలో కొందరు కార్యదర్శులు యాప్‌లో ఫేక్ హాజరు వేసినట్లు అధికారులు గుర్తించినట్లుగా తెలుస్తోంది.

జీపీ మానిటరింగ్ యాప్‌లో..

జీపీ మానిటరింగ్ యాప్‌ను కార్యదర్శులు తమ మొబైల్‌లో ఓపెన్ చేసి డీఎస్ఆర్(డిస్ట్రిక్ శానిటేషన్ రిపోర్ట్)లో పంచాయతీ పరిధిలో ఉండి ఉదయం 11 గంటలలోపు ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ వేయాల్సి ఉంటుంది. అయితే పలువురు కార్యదర్శులు విధులకు డుమ్మా కొడుతున్నట్లు తెలుస్తోంది. విధులకు హాజరు కాకుండా సొంత పనులకు వెళ్తూ ఫేక్ హాజరు వేస్తున్నట్లు సమాచారం. ఇలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకునేందుకు కలెక్టర్ వద్దకు అధికారులు ఫైల్ పంపినట్లు తెలిసింది. జిల్లాలో 335 గ్రామ పంచాయతీలకు పూర్తిస్థాయిలో కార్యదర్శులు లేకపోవడంతో కొందరికి అదనంగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో కార్యదర్శులు రెండు పంచాయతీల్లో ముఖ గుర్తింపు హాజరు వేయకుండా రెగ్యులర్ పోస్టింగ్ ఉన్నచోట మాత్రమే వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇన్‌చార్జిగా ఉన్న పంచాయతీల్లో కారోబార్‌లతో వేయిస్తున్నారు. ఇలాంటి చర్యలను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఫేక్ హాజరు వేస్తే అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో జిల్లాలో ఫేక్ హాజరు వేసిన వారిని గుర్తించే పనిలో అధికారులు ఉన్నారు. ఇప్పటికే కొందరిని గుర్తించగా, వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. అయితే ఇప్పటివరకు జిల్లాలో ఎవరికీ నోటీసులు జారీ చేయలేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఏడాదిన్నరగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో పంచాయతీల నిర్వహణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్యదర్శులు వాపోతున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, తాగునీరు తదితర అవసరాలకు అప్పులు చేస్తున్నామని చెబుతున్నారు. ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకుండా విధుల్లో వెసులుబాటు కల్పించాలని కోరుతున్నారు.

335 గ్రామ పంచాయతీలు..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా జీపీల్లో రెగ్యులర్ కార్యదర్శులు 258 మంది పనిచేస్తుండగా, ఔట్‌సోర్సింగ్ విధానంలో 52 మంది మొత్తం 310 మంది పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. పల్లెల్లో పాలన సజావుగా సాగడంతోపాటు జవాబుదారీతనం కోసం ప్రభుత్వ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పంచాయతీ కార్యదర్శులు విధులకు సక్రమంగా హాజరు కావాలనే ఉద్దేశంతో జూన్ 1 నుంచి ఫేస్ రికగ్నిషన్(ముఖ గుర్తింపు) హాజరు అమలు చేస్తోంది. ఈ ముఖ గుర్తింపు హాజరుపై మొదట్లో పంచాయతీ కార్యదర్శులు విముఖత వ్యక్తం చేశారు. అయితే రాష్ట్రస్థాయిలో చర్చలు జరిగిన అనంతరం జూన్ 12 నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు ఫేక్ హాజరు వేసినట్లు తమ దృష్టికి రాలేదు. నిబంధనలు ఉల్లంఘించి ఫేక్ హాజరు వేసుకుంటే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. కార్యదర్శులు విధులు సక్రమంగా నిర్వర్తించాలి. ప్రతీ రోజు ఉదయం 11 గంటలలోగా పంచాయతీ పరిధిలో హాజరు వేసుకోవాలి.

– భిక్షపతిగౌడ్, జిల్లా పంచాయతీ అధికారి

పచ్చదనంపై నిర్లక్ష్యం!



కాగజ్‌నగర్ మండలం వంజీరిలో ఏర్పాటు చేసిన మున్సిపాలిటీ నర్సరీ



మొక్కలు నాటకుండా వదిలేసిన కవర్లు

- కాగజ్‌నగర్ బల్దియాలో నామమాత్రంగా వనమహోత్సవం
- మొక్కల పంపిణీపై దృష్టి సారించని అధికార యంత్రాంగం
- అస్తవ్యస్తంగా మున్సిపల్ నర్సరీ నిర్వహణ

కాగజ్‌నగర్‌టౌన్: ప్రభుత్వం ఏటా వర్షాకాలంలో మొక్కలు నాటే కార్యక్రమం వనమహోత్సవం పెద్దఎత్తున నిర్వహిస్తోంది. జూన్‌లో వర్షాలు కురిసిన తర్వాత మొక్కలు నాటడం ప్రారంభిస్తారు. అయితే కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో ఈ కార్యక్రమం ముందుకు సాగడం లేదు. బల్దియా కార్యాలయం ఆవరణలో మే నెలలోనే పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏక్ పేడ్ మాకే నామ్, ఉమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమాల్లో భాగంగా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే చేతుల మీదుగా మొక్కలు నాటారు. ఆ తర్వాత వర్షాలు కురిసి రెండు నెలలు గడుస్తున్నప్పటికీ వనమహోత్సవం జోరందుకోలేదు. మున్సిపల్ ఆధ్వర్యంలో ఆయా కాలనీల్లో ఇంటింటికి మున్సిపల్ సిబ్బంది మొక్కలు అందజేస్తారనే ఆశతో ఎదురుచూస్తున్న పట్టణవాసులకు నిరాశే మిగిలింది.

60వేల మొక్కల లక్ష్యం..

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 30 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డుల్లో 60 వేల మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు అవసరమైన మొక్కలను కాగజ్‌నగర్ మండలం వంజీరి గ్రామ సమీపంలో మున్సిపల్ స్థలంలోని నర్సరీలో పెంచుతున్నారు. ఏటా వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నర్సరీ నుంచి వేల సంఖ్యలో మొక్కలు అవసరం ఉంటాయి. నర్సరీ నుంచి మొక్కలను తరలించేందుకు స్వచ్ఛ ఆటోలను వినియోగిస్తారు. ఆయా కాలనీల్లోని ప్రజలకు రోడ్ల పక్కన, ఇళ్ల పరిసరాల్లో నాటేందుకు పంపిణీ చేస్తారు. కానీ ఇప్పటివరకు 10 శాతం కూడా పంపిణీ పూర్తికాలేదు. మున్సిపల్ అధికారులు ఎప్పటివరకు లక్ష్యాన్ని పూర్తి చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

సంరక్షణ చర్యలు కరువు

కాగజ్‌నగర్ బల్దియాకు మొక్కలు సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన వంజీరి నర్సరీపై సంబంధిత అధికారుల పట్టింపు కరువైంది. అధికారుల పర్యవేక్షణ లోపంతో మొక్కలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కొన్ని కవర్లలో మొక్కలు లేకుండా కింద పడేసి ఉన్నాయి. నర్సరీలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయి దర్శనమిస్తున్నాయి. బొప్పాయి, కర్జూర, అల్లనేరడు, గులాబీ, మందారం చెట్లు నామమాత్రంగా ఉన్నాయి. నర్సరీలోని మొక్కలు పట్టణంలో వనమహోత్సవ కార్యక్రమం లక్ష్యం చేరుకునేందుకు సరిపోవనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

ఏర్పాట్లు చేస్తున్నాం

మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డుల్లో త్వరలోనే వనమహోత్సవం కార్యక్రమం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పట్టణ ప్రజలకు ఉచితంగా మొక్కలు కూడా అందజేస్తాం. మొక్కల పెంపకం, సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపడతాం.

– రాజేందర్, మున్సిపల్ కమిషనర్, కాగజ్‌నగర్

లాభాల లెక్క తేలేదెన్నడో?



సింగరేణి కార్మికులు

- ఆర్థిక సంవత్సరం ముగిసి నాలుగు నెలలు దాటినా తేల్చని సింగరేణి
- లాభాల్లో వాటా కోసం కార్మికుల ఎదురు చూపు
- యాజమాన్యం తీరుపై అసంతృప్తి

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ 2024–25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాల లెక్క తేల్చకుండా నానుస్తోంది. ఆర్థిక సంవత్సరం ముగిసి నాలుగు నెలలు దాటినా లాభాలు ప్రకటించకపోవడంపై కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం పెట్టుకోగా, 69.01 మిలియన్ టన్నులు సాధించింది. ఏప్రిల్ 1, 2025న లెక్కలను సమీక్షించిన యాజమాన్యం నాలుగు నెలలు గడిచినా లాభాల వివరాలను వెల్లడించలేదు.

వాటా కోసం కార్మిక సంఘాల డిమాండ్..

సింగరేణి లాభాలను ప్రకటించిన తర్వాత, ఆ లాభాల్లో నిర్దిష్ట శాతాన్ని కార్మికులకు వాటాగా చెల్లించడం ఆనవాయితీ. కానీ లాభాల ప్రకటనలో జాప్యం కారణంగా కార్మిక సంఘాలు యాజమాన్యంపై ఒత్తిడి పెంచుతున్నాయి. ప్రతీ ఆర్థిక సంవత్సరం లాభాలు ప్రకటించిన తర్వాత, కార్మిక సంఘాల నేతలు ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి లాభాల వాటా ప్రకటించాలని కోరుతున్నారు. ఈసారి కూడా లాభాల ప్రకటన ఆలస్యం కావడంతో కార్మికులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

ఉత్పత్తి లక్ష్యాలు, లాభాల లెక్కింపు

సింగరేణి యాజమాన్యం బొగ్గు ఉత్పత్తి, అమ్మకాలు, క్రయవిక్రయాలు ఆర్థిక సంవత్సరం ఆధారంగా జరుగుతాయి. ఈ లెక్కల ఆధారంగానే లాభాలను నిర్ధారిస్తారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల లక్ష్యంలో 69.01 మిలియన్ టన్నులు సాధించినప్పటికీ, లాభాల వివరాలు బయటకు రాకపోవడం కార్మికులను కలవరపెడుతోంది. ''ఈసారైనా త్వరగా లాభాలు ప్రకటిస్తారని ఆశించాం, కానీ ఇంకా ఎలాంటి సమాచారం లేదు'' అని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లాభాల ప్రకటన జాప్యంతో కార్మిక సంఘాలు యాజమాన్యంపై ఒత్తిడి పెంచేందుకు సిద్ధమవుతున్నాయి. కంపెనీ లాభాలను త్వరగా ప్రకటించి, కార్మికులకు వాటా చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నాయి.

లాభాలు ప్రకటించాలి



కంపెనీ వార్షిక లాభాలను వెంటనే ప్రకటించాలి. అందులో కార్మికులకు వాటా చెల్లించాలి. ఆర్థిక సంవత్సరం ముగిసిన వెంటనే లాభాలు ప్రకటించకుండా యాజమాన్యం జాప్యం చేయడం సరికాదు. వాటా డబ్బులు సమయానికి చెల్లిస్తే పిల్లల ఫీజులు, ఇతర ఖర్చులకు పనికొస్తాయి.

– ఎస్కే.బాజీసైదా, ఏఐటీయూసీ బ్రాంచీ కార్యదర్శి

35 శాతం వాటా చెల్లించాలి



ఈసారి బొగ్గు ఉత్పత్తి పెరిగినందున లాభా ల వాటా కూడా పెంచి ఇవ్వాలి. లాభాల్లో 35 శాతం వాటా కార్మికులకు చెల్లించాలి. ఆర్థిక సంవత్సరం ముగిసి నాలుగు నెలలు గడిచినా లాభాలను ప్రకటించకపోవడం గుర్తింపు సంఘం వైఫల్యమే.

– వి.అనిల్‌రెడ్డి, హెచ్ఎమ్మెస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు

గడిచిన ఐదేళ్లలో వచ్చిన లాభాలు, చెల్లించిన వాటా..

ఆర్థిక సంవత్సరం	వచ్చిన లాభాలు (రూ. కోట్లలో)	కార్మికులకు చెల్లించిన శాతం	చెల్లించిన డబ్బులు (రూ. కోట్లలో)
2019–20	993	28	278
2020–21	272.64	29	79.07
2021–22	1,227	30	368
2022–23	2,222	32	710
2023–24	2,412	33	796

అన్నదాతకు 'సంకటహరణ'

- నానో ఎరువులు ప్రోత్సహించేలా ఇఫ్కో చర్యలు
- ఎరువుల కొనుగోలుతో ఉచిత బీమా
- రైతులందరికీ ప్రయోజనం

ఉమ్మడి జిల్లాలో రైతులు, సాగు విస్తీర్ణం, వినియోగించే ఎరువుల వివరాలు..

జిల్లా	రైతుల సంఖ్య	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో..)	యూరియా (మెట్రిక్ టన్నుల్లో)	డీఏపీ (మెట్రిక్ టన్నుల్లో)
మంచిర్యాల	1.64 లక్షలు	3.31 లక్షలు	43 వేలు	13 వేలు
నిర్మల్	1.90 లక్షలు	4.40 లక్షలు	35 వేలు	10 వేలు
ఆసిఫాబాద్	1.32 లక్షలు	4.45 లక్షలు	60 వేలు	12 వేలు
ఆదిలాబాద్	1.65 లక్షలు	5.85 లక్షలు	35 వేలు	13 వేలు

దండేపల్లి: అన్నదాతకు ఎవుసం భారంగా మారుతోంది. ఏటా పెరుగుతున్న పెట్టుబడులు, ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లప్రభావంతో దిగుబడులు తగ్గుతున్నాయి. మరోవైపు చేతికి వచ్చిన పంటకు మద్దతు ధర దక్కడం లేదు. ఎరువులు, కూలీల ధరలు పెరుగుతున్నంతగా పంటల మద్దతు ధర దక్కడం లేదు. అయినా రైతుకు వ్యవసాయం తప్ప వేరే పని తెలియదు. ఇలాంటి పరిస్థితిలో వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెట్టాయి. బోనస్ చెల్లిస్తున్నా యి. పెట్టుబడి సాయం అందిస్తున్నాయి. ఈ క్రమంలో ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కో–ఆపరేటివ్ లిమిటెడ్(ఇఫ్కో) తన నానోప్లస్ యూరియా, నానో డీఏపీ ఎరువులను ప్రోత్సహించేందుకు రైతులకు ఉచిత బీమా కల్పిస్తోంది. ఎరువులు కొనుగోలు చేసే రైతులకు 'సంకటహరణ' ప్రమాద బీమా పథకాన్ని ఉచితంగా అందిస్తోంది. ఈ పథకం కింద రైతులు ఎటువంటి ప్రీమియం చెల్లించాల్సిన అవస రం లేదు. కేవలం ఇఫ్కో ఎరువులను కొనుగోలు చేయడం ద్వారా బీమా పొందవచ్చు. ప్రమాదవశా త్తు మరణం లేదా అంగవైకల్యం సంభవించినా ఈ బీమా వర్తిస్తుంది. ఈ మేరకు ఇఫ్కో ప్రతినిధులు, వ్యవసాయాధికారులు నానో యూరియా ప్లస్, నానో డీఏపీ ఎరువుల వాడకంతోపాటు సంకటహరణ బీమా పథకం గురించి వివరిస్తున్నారు.



ఇఫ్కో నానో యూరియాప్లస్, డీఏపీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారి(ఫైల్)

బీమా అర్హతలు..

సహకార సంఘాల ద్వారా రైతులు ఇఫ్కో సంస్థ అందించే నానోప్లస్ యూరియా, నానో డీఏపీ ఎరువులు కొనుగోలు చేయవచ్చు. వయో పరిమితి లేకుండా ప్రతీ రైతుకు బీమా వర్తిస్తుంది. ప్రతీ నానో ఎరువు బాటిల్ కొనుగోలుపై రూ.10 వేల బీమా కవరేజ్ లభిస్తుంది, గరిష్టంగా రూ.2 లక్షల వరకు బీమా పరిమితి ఉంటుంది. ప్రమాదవశాత్తు రైతు మరణిస్తే 100% పరిహారం, రెండు అవయవాలు కోల్పోతే 50%, ఒక అవయవం కోల్పోతే 25% పరిహారం అందుతుంది. ఈ బీమా ఎరువులు కొనుగోలు చేసిన నాటి నుంచి 12 నెలలు చెల్లుబాటు అవుతుంది.

రైతులకు ప్రయోజనకరం

సహకార సంఘాల ద్వారా ఇఫ్కో సంస్థ నానో యూరియా ప్లస్, నానో డీఏపీలను రైతులకు విక్రయిస్తుంది. వీటి ద్వారా రైతులకు ఎన్నో లాభాలున్నాయి. పైగా ఎరువులు కొనుగోలు చేసే రైతులకు ఆసంస్థ ఉచిత ప్రమాద బీమా అందిస్తోంది. ఇది రైతులందరికీ ప్రయోజనకరం. సద్వినియోగం చేసుకోవాలి.

– అంజిత్‌కుమార్, ఏవో, దండేపల్లి

కొనుగోలు సమయంలో జాగ్రత్తలు..

ఎరువుల కొనుగోలు సమయంలో రైతులు రశీదుపై కొనుగోలు తేదీ, కొనుగోలుదారుని పేరు, తండ్రి లేదా భర్త పేరు, చిరునామా, కొనుగోలు చేసిన ఇఫ్కో ఎరువుల సంఖ్య, నామినీ పేరు, కొనుగోలు దారుని సంతకం లేదా వేలిముద్ర తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. ప్రమాదం జరిగినప్పుడు బీమా పరిహారం పొందడానికి అసలు రశీదు తప్పనిసరి. దీంతోపాటు విక్రయాల రిజిస్టర్ జిరాక్స్, పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ కాపీ, డాక్టర్ చికిత్స నివేదిక, పోస్టుమార్టం నివేదిక, మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. ఈ క్లెయిమ్ పత్రాలు ప్రమాదం జరిగిన తేదీ నుంచి రెండు నెలల్లోగా సికింద్రాబాద్‌లోని ఇఫ్కో బీమా కంపెనీకి పంపించాలి.

టీఎన్‌జీవో జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో ఆదివారం టీఎన్‌జీవో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లింగాల రాజశేఖర్, కార్యదర్శిగా అన్నం శ్రీనివాస్, కోశాధికారిగా పొన్న కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బి.మధుకర్, ఉపాధ్యక్షులుగా హుస్సేన్ బిన్ సయిద్, పోచం, సుమంత్‌రెడ్డి, శ్రీపద, సంయుక్త కార్యదర్శులుగా వెంకటేశ్, ప్రసాద్, పద్మ, శివాని, ప్రచార కార్యదర్శిగా దేవాజీ, మహేశ్‌కుమార్, స్పోర్ట్స్ సెక్రెటరీగా కె.రవీందర్, ఈసీ సభ్యులుగా సునీత, శశికళ, శకుంతల, మహ్మద్ అహ్మద్, అభిజ్ఞ, శరత్, వి.శ్రీనివాస్, ఎస్.శ్రీనివాస్, జె.ప్రేమ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు సంద అశోక్, పరిశీలకులుగా పంచాయతీ సెక్రెటరీ సంఘ రాష్ట్ర అసోసియెట్ అధ్యక్షుడు బి.శ్రావణ్‌కుమార్, లక్సెట్టిపేట్ యూనిట్ సెక్రెటరీ జి.శ్రీనివాస్ వ్యవహరించారు.

రైతులకు సబ్సిడీ యంత్రాలు

- జిల్లాకు రూ.251.44 లక్షల నిధులు

కాగజ్‌నగర్‌టౌన్: జిల్లాలోని రైతులకు ఎస్ఎంఏఎం పథకం కింద 50 శాతం సబ్సిడీపై యంత్ర పరికరాలు అందించాలని వ్యవసాయశాఖకు ఆదేశాలు అందాయి. 2025– 26 సంవత్సరానికిగాను సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకానైజేషన్ స్కీం కింద అర్హులను ఎంపిక చేసి వ్యవసాయ యంత్ర పరికాలు అందించనున్నారు. జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 3.35 లక్షల ఎకరాల్లో పత్తి, 55 వేల ఎకరాల్లో వరి, 32వేల ఎకరాల్లో కంది, 23వేల ఎకరాల్లో పెసర, సోయా, ఇతర పంటలు సాగు చేశారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై అందించే పరికరాలతో ఎకరాకు రూ.10 నుంచి రూ.15 వేల వరకు అదనపు ఖర్చుల భారం తగ్గనుంది. రైతులు ఆర్థికాభివృద్ధికి ఈ పరికరాలు ఎంతో ఉపయోగకరం కానున్నాయి. గతంలో నాగళ్లు, రోటవేటర్లు, పవర్ స్ప్రేయర్లు, గొర్రు, కలుపు తొలగించే యంత్రాలు, వరి కోత మిషన్లు, టార్పాలిన్లు వంటి వాటిని పంపిణీ చేశారు. జిల్లా రైతులు యంత్ర వినియోగంలో వెనుకబడి ఉన్నారు. ప్రస్తుతం అధునాతన యంత్రాలు అందించనున్నారు.

వ్యవసాయ పరికరాలు ఇవే..

ఆసిఫాబాద్ డివిజన్‌లో బ్యాటరీ స్ప్రేయర్లు 1,416, పవన్ స్ప్రేయర్లు 247, రోటవేటర్ 94, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్ 14, కల్టివేటర్ 96, బండ్‌ఫార్మర్ 2, పవర్ వీడర్ 8, బ్రష్ కట్టర్ 16, పవర్ టిల్లర్ 10 మంజూరయ్యాయి. అలాగే కాగజ్‌నగర్ డివిజన్‌కు బ్యాటరీ స్ప్రేయర్లు 1,243, పవన్ స్ప్రేయర్లు 217, రోటవేటర్ 84, సీడ్ కం ఫర్టిలైజర్‌డ్రిల్ 14, కల్టివేటర్ 89, బండ్‌ఫార్మర్ 07 , పవర్ వీడర్ 9, బ్రష్ కట్టర్ 17, పవర్ టిల్లర్ 15 మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. ఆధార్, పట్టా పాసు పుస్తకం, ఫొటోలు, తదితర వివరాలతో మండల వ్యవసాయాధికారి, ఏఈవోల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల, జిల్లాస్థాయి కమిటీల ఆధ్వర్యంలో అర్హులను ఎంపిక చేయనున్నారు. వివిధ కంపెనీలకు చెందిన తయారీదారులు సంబంధిత పరికరాలను సరఫరా చేయనున్నారు. సబ్సిడీ మొత్తాన్ని వ్యవసాయ శాఖ ఆయా కంపెనీలకు అందజేయనుంది.

క్లుప్తంగా

కారు ఢీకొని రెండు గేదెలు మృతి

కడెం: మండలంలోని నవబ్‌పేట్ సమీపంలో శనివారం రాత్రి కారు ఢీకొన్న ఘటనలో రెండు గేదెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కడెం వైపు నుంచి ఉట్నూర్‌కు వెళ్తున్న కారు నవాబ్‌పేట్ సమీపంలో రోడ్డుపై ఉన్న గేదెలను ఢీకొట్టింది. ఈప్రమాదంలో రెండు గేదెలు మృతి చెందగా కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి.

పెట్రోల్ ట్యాంకర్ బోల్తా

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున అదుపుతప్పి పెట్రోల్ ట్యాంకర్ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కడెం నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న పెట్రోల్ ట్యాంకర్ అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ట్యాంకర్ నుంచి పెట్రోల్ లీకవుతుండడం, పక్కనే విద్యుత్ లైను ఉండడంతో అప్రమత్తమైన డ్రైవర్ స్థానికుల సహాయంతో విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఏఈఈ రాంసింగ్ సరఫరా నిలిపివేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై పి.సాయికిరణ్ క్రేన్, జేసీబీలతో రోడ్డు పైనుంచి ట్యాంకర్‌ను తొలగించారు. ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి.

కారును ఢీకొన్న ఐచర్

నిర్మల్: నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రదేశంలో ఆదివారం కారును ఐచర్ వాహనం ఢీకొట్టింది. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల మేరకు...రాంపూర్ గ్రామానికి చెందిన సురకుంట నవీన్‌రెడ్డి కారులో నర్సాపూర్ (జి) బస్టాండ్ వద్ద ఎన్‌హెచ్ 61 రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో నిర్మల్ నుండి భైంసా వైపు వెళ్తున్న ఐచర్ వాహనం డ్రైవర్ సాదుల్లా (కర్ణాటక వాసి) అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వచ్చి కారును ఢీకొట్టాడు. ఘటనలో కారు కొంతమేర దెబ్బతింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. నవీన్‌రెడ్డి తండ్రి సురకుంట నర్సారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు రైస్‌మిల్లులపై కేసు

ముధోల్: మండలంలోని ముద్గల్‌లో గల రెండు రైస్‌మిల్లులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపారు. గ్రామ సమీపంలో గల ఏసియన్ రైస్‌మిల్ యజమాని మష్రొద్దీన్ 2024–25 ఖరీఫ్, రబీ సీజన్‌లో సేకరించిన 4411.917 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి సీఎంఆర్ ఇవ్వలేదని, గణపతి రైస్‌మిల్ యజమాని చింత శ్రీనివాస్ 2699.531 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఇవ్వాల్సి ఉండగా ఇవ్వక పోవడంతో సివిల్ సప్లయ్ అధికారులు రైస్‌మిల్లులను తనిఖీ చేశారు. బియ్యం నిల్వలు లేకపోవడంతో ఈ నెల 8న ముధోల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బెల్టు షాపులపై దాడి

సాత్నాల: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న బెల్టుషాపులపై ఆదివారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై గౌతమ్ పవార్ తెలిపారు. బోడిగుంట్ల అజయ్ వద్ద 35 లీటర్ల మద్యం లభించిందని, మద్యం విలువ రూ.20 వేలు ఉంటుందన్నారు. మాంగూర్ల గ్రామానికి చెందిన బొడుగం సతీష్ వద్ద 5.5 లీడర్ల మద్యం లభించిందని, దాని విలువ రూ.6 వేలు ఉంటుందన్నారు. అదే గ్రామానికి చెందిన బుడగం సుధాకర్ వద్ద 31 లీటర్ల మద్యం లభించిందని, దాని విలువ రూ.14 వేలు ఉంటుందన్నారు.


తీజ్ పాట విడుదల



పాట విడుదల చేస్తున్న దృశ్యం

ఉట్నూర్‌రూరల్: తీజ్ పండుగ సందర్భంగా జాదవ్ బంకట్ లాల్ గానం చేసిన బంజారా సాంస్కృతిక జానపద గీతాన్ని ఆదివారం మండలంలోని రాంనగర్‌లో గ్రామ పెద్దల చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో శశికాంత్ రాథోడ్, గణపత్ జాదవ్, జ్యోతి బాయి, గాయని మాంగుబాయి, మీనాక్షీ, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ ఏజెంట్లను స్ఫూర్తిగా తీసుకోవాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ ఎల్‌ఐసీ ఏజెంట్లను స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని కరీంనగర్ డివిజన్ అధ్యక్షుడు రాజయ్య పేర్కొన్నారు. పట్టణంలోని మంజులపూర్‌లో నూతనంగా నిర్మించిన సంఘ భవనాన్ని ఆదివారం ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లోళ్ల మురళీధర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం బ్రాంచ్ కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నారాయణ, భాస్కర్, క్యాషియర్‌గా వినోద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మల్ బ్రాంచ్ ఏజెంట్లు ఐక్యంగా ఉండి ఒక సొంత భవనాన్ని నిర్మించుకోవడం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో భైంసా నాయకులు ధర్మపురి, ఖానాపూర్ నాయకులు లింగన్న, నిర్మల్ నాయకులు రామారావు, రమేశ్, శ్రీనివాస్, జహీర్, గంగాధర్, రాజమోహన్ రెడ్డి, వసంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘నులి’పేద్దాం..!

- నులిపురుగులతో ఆరోగ్యానికి చేటు
- 19 ఏళ్లలోపు వారిపై తీవ్ర ప్రభావం
- నివారణకు నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- ఉమ్మడి జిల్లాలో 7,24,227 మంది గుర్తింపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

ఉమ్మడి జిల్లాలో 1–19 ఏళ్లలోపు విద్యార్థులు

జిల్లా	విద్యార్థులు
మంచిర్యాల	1,58,400
నిర్మల్	1,91,998
ఆదిలాబాద్	2,06,127
ఆసిఫాబాద్	1,67,702

మంచిర్యాలటౌన్/లక్ష్మణచాంద/ఆదిలాబాద్‌టౌన్/కౌటాల: చిన్నారులను పట్టిపీడించే ఆరోగ్య సమస్యల్లో నులి పురుగులు ప్రధానమైనవి. ఈ పురుగులు పిల్లల పొట్టలో చేరి మెలిపెడుతూ వారి ఎదుగుదలను శాసిస్తుంటాయి. రక్తహీనత, పోషకలోపంతో పాటు పలు అనారోగ్య సమస్యలకు కారణం అవుతాయి. బహిరంగ మల, మూత్ర విసర్జన చేయడం, చెప్పులు తొడుక్కోకుండా తిరగడం, ఆడుకోవడం, భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రపర్చుకోకపోవడంతో తరచూ పిల్లలు కడపునొప్పి, విరేచనాల బారిన పడుతుంటారు. చిన్నారుల పొట్టలో ఏళ్ల తరబడి తిష్టవేసి ఆరోగ్యాన్ని హరించే నులి పురుగులతో జాగ్రత్తలు తప్పనిసరని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. వీటిపై ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా, ముందు జాగ్రత్తలు తీసుకోకపోయినా ప్రాణాంతకంగా మారవచ్చని హెచ్చరిస్తున్నారు. నులి పురుగుల నివారణలో భాగంగా ప్రభుత్వం ఏటా రెండు సార్లు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 11న జాతీయ నులి పురుగుల నివారణ దినంగా జరుపుతున్నారు. 1 నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్న చిన్నారులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 7,24,227 మంది ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గుర్తించారు. వారందరికీ అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు.

నులి పురుగులు అంటే..

నులి పురుగులు అనేవి మానవుల్లో పేగుల నుంచి పోషకాలను గ్రహించి అభివృద్ధి చెందే పరాన్నజీవులు. ఇవి పిల్లలు ఆరుబయట మట్టిలో ఆడుకోవడం, చేతులు కడుక్కోకుండా భోజనం చేయడం, బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయడం, అపరిశుభ్ర పరిసరాలతో నులి పురుగులు చిన్నారుల చెంతకు చేరుతాయి. నులిపురుగులు కలిగిన చిన్నారులు నులి పురుగుల గుడ్లు కలిగిన మలంతో నేలను కలుషితం చేస్తాడు. ఈ గుడ్లు నేలలో లార్వాలుగా వృద్ధి చెందుతాయి. మిగతా పిల్లలు ఆరుబయట మట్టిని ముట్టడం, లేదా ఈ నులిపురుగుల గుడ్లు చేరిన ఆహారం తీసుకోవడం వల్ల ఇతర పిల్లల కడుపులోకి వెళ్లి అక్కడ వృద్ధి చెందడం మొదలు పెట్టి అక్కడే తిష్టవేస్తాయి. 19 ఏళ్లలోపు చిన్నారుల ఆరోగ్యంపై ఈ నులిపురుగులు తీవ్ర ప్రభావం చూపుతాయి.

రక్తహీనత.. పోషక లోపం..

ముఖ్యంగా 19 ఏళ్లలోపు పిల్లలపై నులి పురుగులు, ఏలికపాములు, కొంకి పురుగుల ప్రభావం అధికంగా ఉంటుంది. ఇవి సంక్రమిస్తే పిల్లల్లో రక్తహీనతకు గురవుతారు. పోషకాహార లోపం కనిపిస్తుంది. కడుపునొప్పితో పాటు శరీరం బలహీనతగా అనిపిస్తుంది. ఆందోళనకు గురవుతారు. క్రమంగా బరువు కూడా తగ్గుతారు. ఏకగ్రాత లోపిస్తుంది. నేర్చుకునే సామర్థ్యాన్ని కోల్పోతారు. తదితర లక్షణాలు కనిపిస్తే నులి పురుగులు సంక్రమించినట్లుగా భావించాలని వైద్యులు పేర్కొంటున్నారు.

చప్పరించి మింగాలి

అల్బెండజోల్ మాత్రలను మధ్యాహ్న భోజనం తరువాత అందించనున్నారు. 1 నుంచి 2 సంవత్సరాల పిల్లలకు అరమాత్ర, 2 నుంచి 3 సంవత్సరాల వారికి ఒక మాత్రను పొడి చేసి నీటితో మింగించాలి. 3 నుంచి 19 ఏళ్ల వారు ఒక మాత్రను చప్పరించి మింగాలి. ఇది నేరుగా మింగే మాత్ర కాదు. నోట్లో వేసుకుని చప్పరిస్తే సరిపోతుంది. సోమవారం మాత్రలు తీసుకోని వారికి ఈ నెల 18న మరోసారి మాత్రలు వేయనున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఆహారంపై ఈగలు, దోమలు, కీటకాలు వాలకుండా చూడాలి. పండ్లు, కూరగాయలను శుభ్రమైన నీటితో కడగాలి. స్వచ్ఛమైన నీటినే తాగాలి. చేతి గోర్లను చిన్నగా కత్తిరించుకోవాలి. భోజనానికి ముందు, తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. కాళ్లకు చెప్పులు లేదా బూట్లు ఉంటేనే బయటకు వెళ్లాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

– హరీశ్‌రాజ్, జిల్లా వైద్యాధికారి, మంచిర్యాల

తప్పనిసరిగా వేయించాలి



1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలి. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నారు. కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– రాజేందర్, జిల్లా వైద్యాధికారి, నిర్మల్

ఏర్పాట్లు పూర్తి చేశాం



జిల్లా వ్యాప్తంగా నేడు అన్ని ప్రభుత్వ, ప్రేవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ వేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు తప్పనిసరిగా 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ మాత్రలు వేయించాలి. మధ్యాహ్నం భోజనం తర్వాత వైద్యులు, సిబ్బంది పర్యవేక్షణలో మాత్రలను వేయించాలి.

– సీతారాం, డీఎంహెచ్‌వో, ఆసిఫాబాద్

బాసరలో భక్తుల రద్దీ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బాసర: బాసర జ్ఞానసరస్వతీ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు వేకువజామున శ్రీమహాలక్ష్మీ, సరస్వతి, మహాకాళి అమ్మవార్లకు అభిషేకం, అర్చన, హారతి విశేష పూజలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులు ముందుగా పవిత్ర గోదావరినదిలో పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం ఆలయంలో అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షర శ్రీకారం, కుంకుమార్చన పూజలు చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

‘నవోదయ’లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి డిసెంబర్ 13న నిర్వహించనున్న పరీక్షకు ఈ నెల 13లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రేపాల కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆధార్‌కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్, పాస్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



సాగర్ (ఫైల్)

నస్పూర్: చిన్ననాటి నుంచి దేశానికి సేవ చేయాలని కన్న కలలు నెరవేరకుండానే రోడ్డు ప్రమాదం రూపంలో ఆ యువకుడు మృత్యుఒడిలోకి చేరిన ఘటన మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు వరంగల్ రూరల్ జిల్లా దుగ్గొండి మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన చిలువేరు సాగర్(23), మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కుష్నపల్లి గ్రామానికి చెందిన ఆకుల రాకేశ్, నిజామాబాద్‌కు చెందిన విష్ణువర్ధన్ మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని ఓ డిఫెన్స్ అకాడామీలో శిక్షణ పొందుతున్నారు. ముగ్గురు స్నేహితులు కలిసి ఆదివారం సాయంత్రం ఓ ఫంక్షన్‌కు వెళ్లేందుకు గిఫ్ట్ కొందామని బైక్‌పై బయల్దేరారు. స్థానిక రాయల్ గార్డెన్ చౌరస్తా సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న సిమెంట్ కట్టడంపై పడింది. దీంతో సాగర్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాకేశ్, విష్ణువర్ధన్‌ను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాకేశ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం వరంగల్‌కు తరలించారు. సీసీసీ నస్పూర్ ఎస్సై ఉపేందర్‌రావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ప్రమాదవశాత్తు కాలువలోపడి ఒకరు..



సుధాకర్ (ఫైల్)

సోన్: ప్రమాదవశాత్తు కాలువలోపడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని న్యూ వెల్మల్ గ్రామానికి చెందిన బొడ్డు సుధాకర్ (37) ఆదివారం వరుసకు సోదరుడైన బొడ్డు పెద్ద లస్మన్నతో కలిసి పంటచేనుకు వెళ్లాడు. సరస్వతి కాలువలో లస్మన్న ఏర్పాటు చేసిన మోటార్ నుంచి నీళ్లు రాకపోవడంతో సుధాకర్ ఫుట్‌బాల్ పైపుకు తట్టుకున్న చెత్తను తీసివేసే క్రమంలో కాలుజారి కాలువలోపడి మృతి చెందాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై నర్సయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి మాజీ కార్మికుడు..



రాజయ్య(ఫైల్)

తాండూర్: రోడ్డు ప్రమాదంలో సింగరేణి మాజీ కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కొత్త గుడిసెల కాలనీకి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు గణపతి రాజయ్య (60) ఆదివారం తెల్లవారుజామున వాకింగ్ చేస్తూ కొత్తపల్లి వైపు వెళ్తుండగా బైక్‌పై వచ్చిన దెబ్బటి శ్రావణ్ వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు రాజయ్య అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. శ్రావణ్‌ను మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించారు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో అంగన్‌వాడీ టీచర్..



విజయ (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: మండలంలోని రామ్ లింగంపేటకు చెందిన అంగన్‌వాడీ టీచర్ సీహెచ్ విజయ (64) గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమగ్ర బాలభ్యుదయ పథకంలో కొన్ని దశాబ్దాలుగా అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న విజయ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతోంది. ఆదివారం ఉదయం ఛాతిలో నొప్పివస్తుందని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందిందని ఆమె భర్త స్వామి తెలిపారు. పేద కుటుంబానికి చెందిన విజయ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మృతురాలికి ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య



అనుషా (ఫైల్)

మంచిర్యాలక్రైం: మనస్తాపంతో యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు జిల్లా కేంద్రంలోని భగవంతంవాడకు చెందిన నులిగొండ మల్లేశ్ కూతురు అనుషా (23) డిగ్రీ వరకు చదివి ఇంటివద్దే ఉంటోంది. నాలుగేళ్ల క్రితం డిగ్రీ చదువుతున్న సమయంలో అదే కళాశాలలో చదువుతున్న జైపూర్ మండలం కుందారంకు చెందిన రంగుల శ్రీకాంత్‌తో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఇద్దరి కులాలు వేరుకావడంతో అనుషా తల్లితండ్రులు పెళ్లికి ఒప్పుకోలేదు. ఇదే అదనుగా భావించిన శ్రీకాంత్ నగలు, నగదు తెస్తేనే పెళ్లి చేసుకుంటానని, లేదంటే వేరే ఎవరిని పెళ్లి చేసుకున్నా తమవద్ద ఉన్న ఫొటోలు బయటపెడతానని బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన యువతి ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. యువతి మృతికి కారణమైన రంగుల శ్రీకాంత్, తండ్రి కిష్టయ్య, తల్లి రాజేశ్వరి, అన్నయ్య రమేశ్‌పై బాధిత కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

వెండి కిరీటం బహూకరణ



కిరీటం బహూకరిస్తున్న కుటుంబ సభ్యులు

కుంటాల: ప్రాచీన శ్రీకృష్ణ దేవాలయంలోని కృష్ణుని విగ్రహానికి కుంటాల గ్రామానికి చెందిన చిప్ప కృష్ణవేణి–సాయినాథ్ సీనియర్ సైంటిస్ట్ దంపతులు ఆదివారం రూ.1.45 లక్షల విలువైన వెండి కిరీటాన్ని బహూకరించారు. 12 గ్రాముల బంగారం, 350 గ్రాముల వెండితో కిరీటం తయారు చేయించినట్లు దాత తల్లిదండ్రులు గంగామణి, హన్మాండ్లు తెలిపారు.

24 గంటల్లోనే దొంగ పట్టివేత

- వివరాలు వెల్లడించిన ఏసీపీ రవికుమార్



అరెస్టు చూపుతున్న ఏసీపీ రవికుమార్, సీఐ

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గద్దెరాగిడి పద్మావతికాలనీలో భారీ చోరీకి పాల్పడిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. సీసీపుటేజీ ఆధారంగా 24 గంటల్లోనే నిందితుడిని అరెస్టు చేసి దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. భూపాలపల్లిలో ఉంటున్న సింగరేణి కార్మికుడు మేకల రాజయ్య గద్దెరాగిడిలో నూతనంగా ఇల్లు నిర్మించాడు. శుక్రవారం కొత్తింట్లో వరలక్ష్మీ వ్రతం చేశారు. కుటుంబసభ్యులు, బంధువులు రాత్రి నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారుజామున రాజయ్య లేచి చూసేసరికి ఇంట్లోని బ్యాగులు చిందరవందరగా పడి ఉన్నాయి. బ్యాగులో దాచిన దాదాపు 40 తులాల బంగారు ఆభరణాలు, ఓ సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. రంగంలోకి దిగిన పోలీసులు సీసీపుటేజీలో అనుమానాస్పదంగా ఓ వ్యక్తి పలుచోట్ల కనిపించడంతో పాత నేరస్తుడు జాడి సురేష్‌గా గుర్తించారు. ఆదివారం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసింది తానేనని ఒప్పుకోవడంతో బంగారు ఆభరణాలతో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. మంచిర్యాలలోని రాజీవ్‌నగర్‌కు చెందిన సురేష్‌పై గతంలోనూ పలు చోరీ కేసులున్నాయని, ముఖ్యంగా శుభకార్యాలు జరిగే ఇళ్లపై ఎక్కువగా దృష్టి సారిస్తాడన్నారు. నిందితుడిని ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో పట్టణ ఎస్సై రాజశేఖర్, మందమర్రి ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు. దొంగను పట్టుకోవటంలో చాకచక్యంగా వ్యవహరించిన పలువురు పోలీసులకు ఏసీపీ రివార్డులను అందించారు.

పశువుల చోరీ కేసులో ఒకరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అవినాష్

ముధోల్: ముధోల్‌లో ఇటీవల జరిగిన పశువుల చోరీ కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ అవినాష్‌కుమార్ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇటీవల హంగీర్గ భోజన్న అనే రైతుకు చెందిన పశువులు దొంగిలించబడ్డాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ మైలు, ఎస్సైలు బిట్లా పెర్సిస్, జుబేర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంగా ఏర్పడ్డారు. సీసీ కెమెరాల ఆధారంగా మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన మహ్మద్ ఫైజాన్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఆరుగురు నిందితులు కేసులో ఉన్నారని, మిగతా వారికోసం గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ ముఠా సభ్యులు ముందుగా పశువులకు మత్తు మందు ఇచ్చి చోరీకి పాల్పడుతున్నారన్నారు. పశువుల మాంసానికి మహారాష్ట్రలో డిమాండ్ ఉండడంతో ఈ పనులకు పాల్పడుతున్నారని తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ మైలు, ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ పాల్గొన్నారు.

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ

- ఐదుగురికి తీవ్రగాయాలు



ఘటనాస్థలిలో ప్రయాణికులు

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) శివారులో రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఆదివారం ఆదిలాబాద్ డిపోకు చెందిన ప్రైవేటు ఆర్టీసీ బస్సు నిర్మల్‌వైపు వెళ్తుండగా నిర్మల్ వైపు వస్తున్న ఇదే డిపోకు చెందిన మరో బస్సును వేగంగా ఢీకొట్టింది. ఘటనలో వెనుకవైపు నుంచి ఢీకొట్టిన బస్సులో ప్రయాణిస్తున్న లక్ష్మణచాందకు చెందిన తోకల సునీత, ఆశీస్, ఆదిలాబాద్‌కు చెందిన కార్తీక్ గౌడ్, ఉట్నూర్‌కు చెందిన ఇందిరా, సారంగాపూర్ మండలం లక్ష్మీపూర్‌కు చెందిన కాంతాబాయికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై శ్రీకాంత్ ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారకుడైన బస్సు డ్రైవర్ సిందే అజయ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పత్తి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు



బానోతు ప్రసాద్, ఏడీఏ, చెన్నూర్

చెన్నూర్‌రూరల్: వర్షాలు కురవడంలో ఆలస్యమైన సమయాల్లో, వర్షాలు అధికంగా ఉన్న సమయాల్లో, వర్షాలు ముఖం చాటేసినప్పుడు పత్తి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చెన్నూర్ ఏడీఏ బానోతు ప్రసాద్ వివరించారు. కొన్ని సమయాల్లో అంతరపంటలు వేసుకోవాలని సూచించారు.

వర్షాలు ఆలస్యంగా వచ్చిన సమయంలో....

రుతుపవనాలు ఆలస్యమైన సమయాల్లో పత్తిలో స్వల్పకాలిక బీజీ–2 రకాలను ఎన్నుకోవాలి. 1–3 వంతు నత్రజని, 1–3 వంతు పొటాషియం, పాస్పరస్ మొత్తాన్ని దుక్కిలో వేసుకోవాలి. ఇలా చేయడంతో మొక్క లేత దశలో పెరుగుదల బాగా ఉంటుంది. తరచూ అంతరకృషి చేయాలి. ఇలా చేయడం వలన మొక్కకు కావాల్సిన తేమ అందుతుంది. కలుపు ఎప్పటికప్పుడు తీసివేస్తూ ఉండాలి. దీంతో భూమిలోని తేమకు, పోషకాలకు మధ్య పోటీ ఉండదు.

తేమ ఉన్నప్పుడే..

వర్షాలు కురవడంలో ఆలస్యమైతే నేలలో సరిపడా తేమ ఉన్నప్పుడే ఎరువులు వాడాలి. లేదంటే 2 శాతం యూరియా ద్రావనాన్ని 10 నుంచి 15 రోజుల వ్యవధిలో 3 నుంచి 4 సార్లు పిచికారీ చేయాలి. తరచూ అంతరకృషి చేయడం వల్ల పంట కలుపు లేకుండా అలాగే మొక్కకు కావాల్సిన తేమ అందుతుంది. రసం పీల్చే పురుగులను అదుపులో ఉంచాలి.



పత్తి పంట

వర్షాలు అధికంగా కురిసిన సమయంలో....

వర్షాలు అధికంగా కురిసిన సమయంలో నీటిని కాలువల ద్వారా బయటకు పంపించే ఏర్పాట్లు చేయాలి. బూస్టర్‌గా 30 కిలోల నత్రజనిని హెక్టారుకు అందించాలి. అంతరకృషి చేసి నేలను తెరిచినట్లయితే ఎక్కువగా ఉన్న నీరు ఆవిరై పోతుంది. హీలియంతుస్ ఉధృతి ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు డైఫ్లూటింజురాన్‌ను హెక్టారుకు 250–300 గ్రాములు పిచికారీ చేయాలి. పెరుగుదల అతిగా ఉంటే కొనలను తుంచివేయాలి. కాయకుళ్లు తెగులు రావడానికి అవకాశాలు ఎక్కువ కాబట్టి దానిని అదుపులో ఉంచుకోవడానికి కాపర్ ఆక్సిక్లోరైడ్ పిచికారీ చేసుకోవాలి.

వర్షాలు ఆగిన సమయాల్లో

వర్షాలు ఆగిన సమయాల్లో మొక్కకు పోషకాలు అందించాలి. ఇందుకు గానూ 2 నుంచి 3 సార్లు 2 శాతం యూరియా ద్రావణాన్ని ఆకులపైన పిచికారీ చేయాలి. తరచూ అంతరకృషి చేసి కలుపు నివారణతో పాటు మొక్కకు కావాల్సిన తేమను అందజేస్తూ ఉండాలి. అంతర పంటలుగా పెసర, సోయా బీన్, మినుము వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేసుకోవాలి.

వర్షాలు ముఖం చాటేస్తే..

వర్షాలు అసలే కురియకపోతే ఆగస్టు తర్వాత పత్తిని విత్తకూడదు. ఇలాంటి సూచనలు పాటించినట్లయితే రైతులు నష్టపోకుండా ఉంటారు.

ఆదివాసీలకు అధికారుల కౌన్సెలింగ్



ఆదివాసీలతో మాట్లాడుతున్న అధికారులు

జన్నారం: అడవిలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న జైనూర్, సిర్పూర్ మండలాలకు చెందిన పలువురు ఆదివాసీ గిరిజనులకు ఆదివారం అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇందన్‌పల్లి రేంజ్ అధికారి శ్రీధరచారితో పాటు లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి, ఎస్సై అనూష, దండెపల్లి ఎస్సై తహసీనొద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్ ఇందన్‌పల్లి అటవీ రేంజ్, కవ్వాల్ అటవీ సెక్షన్, సోనాపూర్ బీట్ పాలఘోరి ప్రాంతానికి వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. అటవీభూమిలో నివాసం ఉండటం చట్టవిరుద్ధమని, ఏదైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సీఐ సూచించారు. అయితే పూర్వీకుల నుంచి ఈ భూమి మాదే అని కాగితాలున్నాయని, అందుకే నివాసం ఉంటున్నామని వారు పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్, ఐటీడీఏ పీవో, తహసీల్దార్‌కు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు ఆదివాసీలు పేర్కొన్నారు.